క్లుప్తంగా

వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు



వారాహి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మోళ్లపర్రు కనకదుర్గ బీచ్‌లో వేంచేసియున్న దశావతార సహిత మత్స్యనారాయణ స్వామి, అష్టలక్ష్మీ సమేత ఆదిలక్ష్మి అమ్మవార్ల ఆలయంలో వారాహి నవరాత్రుల కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నిత్యార్చన పూజా కార్యక్రమంలో భాగంగా సోమవారం అమ్మవారి సన్నిధిలో నక్షత్ర శాంతి, దుష్టగ్రహ పీడన నివారణ కార్యసిద్ధికి నిత్యార్జన కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే పూజకు నాడిగి రంగారావు, అముదాలపల్లి సుబ్రమణ్యం, సత్తినేని సర్వేశ్వరరావు, మేళం రంగనాథ్ దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శోభారాణి

పాలకొల్లు అర్బన్: నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడంలో విద్యార్థినులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి కోరారు. పట్టణంలోని డీఎన్నార్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం సందర్భంగా ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్ వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి గెలుపొందిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి ఎ.కృష్ణారెడ్డి, అధ్యాపకులు ఆంజనేయులు, వీరభద్రం, మురళీకృష్ణ, ప్రేమ్‌కుమార్, విద్యార్థినులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



అభివృద్ధి పనులను పునఃప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

పెనుగొండ: ఆచంట మండలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి తెలిపారు. సోమవారం ఆచంట మండలం కరుగోరుమిల్లిలో నిలిచిపోయిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం పనులను తిరిగి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్ బాబు, సర్పంచ్ అల్లం పద్మావతి, కూటమి నాయకులు అల్లం సూర్య ప్రకాశరావు, సలాది మురళీకృష్ణ, ఉంగరాల లక్ష్మణరావు, సలాది శ్రీధర్, ముత్యాల్య వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

పేరూరు ఘటనపై ప్రభుత్వం స్పందించాలి



నియామక పత్రాలు అందజేస్తున్న పుష్పరాజ్

భీమవరం: కడప జిల్లా ఒంటిమిట్ట మండలం పెన్న పేరూరు గ్రామంలో ఎస్సీ వర్గానికి చెందిన కదిరి ప్రభాకర్‌పై అగ్రవర్గ దురహంకారులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ చెప్పారు. సోమవారం భీమవరంలో మాలమహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బంధువు మృతితో ఖనన కార్యక్రమానికి హాజరై తిరిగి ఇంటికి వెళుతున్న ప్రభాకర్ నీరసంతో కాసేపు విశ్రాంతి కోసం అగ్రవర్ణానికి చెందిన వ్యక్తి ఇంటి అరుగుపై కూర్చోవడంతో వేడినూనె వేసి గాయపర్చడమేగాక కులం పేరుతో దుర్భాషలాడిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, బాధితుడికి వైద్య నిమిత్తం ప్రభుత్వం స్పందించాలని పుష్పరాజ్ డిమాండ్ చేశారు. అనంతరం భీమవరం మండల మాలమహానాడు కార్యదర్శిగా సాదే ప్రసాద్, సహాయ కార్యదర్శిగా వర్దనపు తేజను నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నేతల సువర్ణ రాజు, తొర్లపాటి భాగ్యరాజ్, పిట్టా వినోద్‌కుమార్, నల్లి రాజేష్ (మున్నా), చిగురుపాటి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి హుళక్కేనా..

- మార్గదర్శకాలపై కూటమి సర్కారు మీనమేషాలు
- ఆందోళనలో నిరుద్యోగులు



పాలకొల్లు అర్బన్/నరసాపురం రూరల్: ఎన్నికల ముందు చంద్రబాబు సూపర్ సిక్స్ పథకంలో భాగంగా నిరుద్యోగులకు అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని టీడీపీ మేనిఫెస్టోలో చేర్చింది. తీరా అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటినా నిరుద్యోగ భృతిపై మార్గదర్శకాలను నిర్దేశించకపోవడంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. కూటమి సర్కారు నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లినట్లు అయ్యిందని పలువురు నిరుద్యోగులు వాపోతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి నిరుద్యోగ భృతి విధివిధానాలపై మార్గదర్శకాలు విడుదల చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు. నిరుద్యోగులు 2014 ఎన్నికల్లో చంద్రబాబు హామీ నమ్మి ఒకసారి మోసపోయారు. ఇప్పుడు 2024 ఎన్నికల వాగ్దానాలలో చంద్రబాబు మాటలు నమ్మి నిరుద్యోగులు మరో సారి మోసపోయినట్లు కనబడుతుందని పలువురు నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇచ్చిన మాట తప్పకుండా కూటమి ప్రభుత్వం తక్షణమే నిరుద్యోగ భృతి అమలు చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

నిరుద్యోగ భృతి గురించి మాట్లాడరేం?



నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చేంత వరకూ నెలకు రూ.3వేలు ఇస్తామని చెప్పి ఓట్లేయించుకున్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ మాట మాట్లాడకపోవడం దారుణం. నాకు ఇద్దరు కొడుకులు చదువుకొని ఉద్యోగావకాశాలు లేక కూలి పనులు చేసుకుంటున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిరుద్యోగులకు భృతి అందించాలి.

పులపర్తి త్రిమూర్తులు, వసలదీవి

నిరుద్యోగ భృతిపై నోరుమెదపరేం!



నేను 2021లో బీటెక్ పూర్తి చేశాను. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాలిస్తాం అన్నారు. లేదా రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తాం అని హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి నెల రోజులు దాటుతున్నా సీఎం చంద్రబాబు దీనిపైనోరు మెదపడం లేదు. అసలు నిరుద్యోగ భృతి ఎప్పటి నుంచి ఇస్తారో కూడా అర్థ కావడం లేదు. బీటెక్ పూర్తి చేసిన నాకు ఉద్యోగం వస్తుందనే ఆశతో ఎదురు చూస్తున్నాను. కూటమి ప్రభుత్వం ద్వారా కనీసం నిరుద్యోగ భృతి అయినా దక్కుతుందని ఆశ పడ్డాను. అయితే కూటమి ప్రభుత్వం దీనిపై మార్గదర్శకాలు వెలువడకపోవడంతో నిరుద్యోగులు మరోసారి మోసపోయినట్లేనా.

అయినపర్తి రాహుల్, బీటెక్, పూలపల్లి

జలదిగ్బంధంలో రామలింగేశ్వరుడు



సత్తారామేశ్వరంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో చేరిన ముంపు నీరు

పెనుమంట్ర: పెనుమంట్ర మండలంలోని గోస్తనీ డ్రెయిన్ పొంగి ప్రవహిస్తుండటంతో సత్తారామేశ్వరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం జల దిగ్బంధంలో చిక్కుకుంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి జలాలను గోస్తనీ పంట కాలువ ద్వారా వేల్పూరు వద్ద గోస్తనీ డ్రెయిన్‌లోకి మళ్లించడంతో ఈ ముంపు సమస్య మరింత ఎక్కువయ్యింది. గోస్తనీ డ్రెయిన్‌లో కిక్కిస చెత్త పేరుకుపోవడంతో దిగువకు మురుగు నీరు ప్రవహించకపోవడంతో పెనుమంట్ర మండలంలోని నాట్లు వేసిన వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. అంతే కాకుండా పుణ్యక్షేత్రాల ఆవరణలో కూడా నీరు నిలిచిపోవడంతో స్వామివారి నిత్య పూజలకు కొంత అంతరాయం ఏర్పడుతుంది.

గ్యాస్ వినియోగదారుల ఈకేవైసీ తప్పనిసరి



లక్కీడ్రా విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పోడూరు: హెచ్‌పీ వంట గ్యాస్ వినియోగదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని స్థానిక శ్రీ సీతారామా గ్యాస్ ఏజెన్సీ అధినేత పి.లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. హెచ్‌పీ గ్యాస్ కంపెనీ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్థానిక గ్యాస్ ఏజెన్సీ ద్వారా వేడంగిపాలెంలో వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఏజెన్సీ అధినేత లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఈకేవైసీ పూర్తి చేసుకున్న వినియోగదారులకే ప్రభుత్వ రాయితీలు, పథకాలు వర్తిస్తాయన్నారు. తమ ఏజెన్సీ పరిధిలో వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి ఎల్‌పీజీ పంచాయత్, స్టౌ ఎక్సేంజ్ మేళా, ఫ్రీ సర్వీసింగ్ క్యాంప్, ఈకేవైసీ నమోదు నిర్వహించారు. లక్కీ డ్రా ద్వారా ముగ్గురు వినియోదారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ చెల్లబోయిన శారద, మాజీ సర్పంచ్ యర్రంశెట్టి పద్మారావు, ఎంపీటీసీ దొరబాబు, గ్యాస్ ఏజెన్సీ సూపర్‌వైజర్ కడలి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మీ కోసంలో మూడు ఫిర్యాదులు

ఆకివీడు: మీకోసం ప్రజా ఫిర్యాదుల విభాగానికి సోమవారం మూడు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ రామకృష్ణ చెప్పారు. జాతీయ రహదారి ప్రాంతంలోని అజ్జమూరు గరువు ప్రాంతంలోనూ మురుగునీరు రోడ్డు మీదకు చేరడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, రోడ్డు గోతులమయంగా మారుతోందని, సమస్య పరిష్కరించాలని కోరారు. అదే విధంగా నగర పంచాయతీ పరిధిలోని మెయిన్ రోడ్డు, ఎస్‌బీఐ, జెడ్పీ హైస్కూల్ వరకూ జాతీయ రహదారి నీట మునిగి దుర్వాసన వెదజల్లుతోందని, ఆయా ప్రాంతాల్లో మురుగునీటి పారుదలకు చర్యలు తీసుకోవాలని వీవీఎస్ఎస్ ఆర్ మూర్తి ఫిర్యాదు అందజేసినట్లు చెప్పారు. స్థానిక గుమ్ములూరు సెంటర్‌లో షాపుల అద్దె విషయం, ఖాళీచేయకుండా ఇబ్బందులు పెడుతున్న సంఘటనపై జీ.ఆనందరాజు ఫిర్యాదు చేశారని ఎంపీడీఓ వివరించారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి



విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు అందజేస్తున్న సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి, తదితరులు

పోడూరు: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టపడి చదివితే పరీక్షల్లో మంచి మార్కులు వస్తాయని జిన్నూరు గ్రామ సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి పిలుపునిచ్చారు. జిన్నూరులోని ఏఎస్ఆర్ జెడ్పీ హైస్కూల్లో సోమవారం నిర్వహించిన స్టూడెంట్ కిట్ పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం చదువుపైనే దృష్టి సారించి ప్రతిభా పాటవాలను పెంచుకోవాలన్నారు. విద్యతోనే భావి భారతదేశం మరింత అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. మండల పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ పాలవలస తులసీరావు మాట్లాడుతూ విద్యతోనే పేద కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భూపతిరాజు సత్యనారాయణరాజు, సీఆర్‌పీ కె.భారతి, హెచ్.ఎం సీహెచ్.శివజ్యోతి, మాజీ ఉప సర్పంచ్ యలకల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

పెనుమంట్ర: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 16న ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తామని ఎంపీడీవో పి.పద్మజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షులు కర్రి వెంకట నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో మండలంలోని సమస్యలపై చర్చించిన అనంతరం పలు తీర్మానాలు ఆమోదిస్తామన్నారు. సమావేశానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె కోరారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

పెనుగొండ: స్కోజో ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెనుగొండ పంచాయతీలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ తెలిపారు. వైద్య శిబిరం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. అందరికీ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అవసరమైన వారికి ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారన్నారు. వైద్య శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యదర్శి టి.రత్నాకరరావు పాల్గొన్నారు.

లెప్రసీ కేసులను గుర్తించాలి



పోస్టర్‌లు విడుదల చేస్తున్న డాక్టర్లు దినేష్, లక్ష్మీపార్వతి

మొగల్తూరు: లెప్రసీ కేసులను గుర్తించేందుకు సిబ్బంది గ్రామాల్లో ప్రతీ ఇంటిని సందర్శించాలని డాక్టర్లు ఓ.దినేష్, కె.లక్ష్మీపార్వతిలు ఆదేశించారు. సోమవారం మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆశ మరియు ఏఎన్ఎంల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 18 నుంచి ఆగష్టు 2 వరకు ఆశ వర్కర్లు ప్రతీ ఇంటిని సందర్శించాలన్నారు. రాగి రంగులో ఉండి, స్పర్శలేని మచ్చలు ఉన్న వారిని గుర్తించి ఆసుపత్రికి పంపాలన్నారు. ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించి లెప్రసీగా గుర్తిస్తే, నివారణకు మందులు అందజేస్తామన్నారు. మైక్రో బ్యాక్టీరియా లెప్రసీ అనే సూక్ష్మ క్రిములు ఉంటే 12 నెలలు, పాసివ్ బాసిల్లై బ్యాక్టీరియా ఉంటే 6 నెలలు చికిత్స తీసుకుంటే లెప్రసీని పూర్తిగా నివారించొచ్చన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ జక్కంపూడి రాంప్రసాద్, మాజీ డీపీఎంవో సుధీర్, ఎంపీహెచ్‌వో ఏఎస్ఎస్ఎన్ మూర్తి, సిబ్బంది సత్యవతి, విజయలక్ష్మి, బి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరంలో రోగులకు మందులు అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డా.స్వరూప్ కోరారు. పాలకొల్లు మండలం వెలివెల సచివాలయ కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సలహాలు ఇచ్చారు. వర్షాకాలంలో మంచినీరు కలుషితమవుతుందని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని, వేడివేడి ఆహార పదార్థాలు భుజించాలని పేర్కొన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీల్లో రోజువారీ ముగ్గు, బ్లీచింగ్ చల్లాలని కోరారు. మంచినీటి క్లోరినేషన్ పరీక్షలు నిర్వహించాలన్నారు. శిబిరంలో గ్రామ సర్పంచ్ కందుల వెంకటేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ శైలజ, ఏఎన్ఎం లలితకుమారి, హెల్త్ సూపర్‌వైజర్ కమల, హెల్త్ అసిస్టెంట్ గోపాలకృష్ణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ఎం విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి

పాలకొల్లు అర్బన్: ఉద్యోగాలు పొందిన విద్యార్థులు మంచిగా పని చేసి కంపెనీ అభివృద్ధికి పాటు పడాలని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి కోరారు. పట్టణంలోని ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎంఎస్సీ ఆక్వా కల్చర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 7 గురు జెనిక్స్ ప్రో ప్రైవేట్ లిమిటెడ్, భీమవరం వారు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి, కంపెనీ సీఈవో సలాది గోపికృష్ణ, విజయ డయాగ్నోస్టిక్ లేబరేటరీ అధినేత కొమ్ముల మురళీ కృష్ణ నియామక పత్రాలు అందజేసి మాట్లాడారు. కళాశాల ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ కె.భద్రాచలం, జువాలజీ, ఆక్వా కల్చర్ హెచ్‌వోడీ డాక్టర్ రామకృష్ణ, పి.జ్యోత్స్నశ్రీ డి.హెప్సీరాణి పాల్గొన్నారు.

రహదారులు జలమయం



అన్నపూర్ణ థియేటర్ రోడ్డు వర్షం నీటితో మునిగిపోయిన దృశ్యం

నరసాపురం: సోమవారం నరసాపురంలో కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. సాయంత్రం 4 గంటలకు సుమారు గంట కురిసిన వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రెయిన్స్ పొంగిపొర్లాయి. దీంతో పట్టణంలో ప్రధాన సెంటర్లలో మోకాలు లోతు నీరు చేరింది. బస్టాండ్, స్టీమర్ రోడ్డు, ప్రకాశం రోడ్డు ప్రాంతాలు నీట మునిగాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యార్థులు ఇళ్లకు చేరుకోవడానికి నానా అవస్థలు పడ్డారు. ఫుట్‌పాత్ వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

నేడు అవగాహన సదస్సు

పెనుగొండ: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కేరీర్ గైడెన్స్ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు పెనుగొండ మండల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర ఎన్.విజయరాజు, షేక్ మస్తాన్‌లు తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ముఖ్య అతిథులుగా ఏపీ కేరియర్ గైడెన్స్ కన్వీనర్, మానవత విస్తరణ అధికారి డాక్టర్ కోడూరు రాధా పుష్పవతి, సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు పాల్గొంటారని తెలిపారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు డెస్క్‌టాప్ కంప్యూటర్, ప్రోత్సాహక బహుమతులు అందిస్తారన్నారు. విద్యార్థులు, మానవత కుటుంబ సభ్యులు పాల్గొనాలని కోరారు.

31న బార్ అసోసియేషన్ ఎన్నికలు

నరసాపురం: వాయిదా పడ్డ నరసాపురం న్యాయవాదుల సంఘం కార్యవర్గ ఎన్నికలను ఈ నెల 31న నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి నల్లిమిల్లి జోషప్ చెప్పారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి ఈ నెల 19, 20 తేదీల్లో నామినేషన్‌లు స్వీకరించి, 21న పరిశీలిస్తామని తెలిపారు. 24, 25 తేదీల్లో నామినేషన్‌ల ఉపసంహరణకు గడువు ఉంటుందని చెప్పారు. 31న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ పోలింగ్ నిర్వహించి అదే రోజు ఓట్లు లెక్కిస్తామన్నారు. అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శితో పాటు పలు పదవులకు ఎన్నిక నిర్వహిస్తామని చెప్పారు.

చెరువుపై ఆక్రమణలు తొలగించాలని వినతి

పాలకోడేరు: వేంద్ర గ్రామంలోని సంతమార్కెట్ వద్ద గల కొండాయ చెరువుపై ఆక్రమణలను తొలగించాలని కోరుతూ గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందజేశారు. చెరువు చుట్టుపక్కల వారు తమ ఇళ్లల్లో నుంచి మురుగునీరు, గృహాల్లోని వ్యర్థాలు వేస్తూ చెరువు నీటిని కలుషితం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో ఈ చెరువు నీటిని వ్యవసాయానికి సాగునీరుగా, పశువులకు తాగునీరుగా ఉపయోగించుకునే వారమని, ప్రస్తుతం చెరువు చుట్టుపక్కల చికెన్ దుకాణాలు ఏర్పాటు చేసుకుని చెరువులో వ్యర్థాలు వేస్తున్నారని ఆరోపించారు. వెంటనే చర్యలు తీసుకుని చెరువుపై ఆక్రమణలు తొలగించి, చెరువులో వ్యర్థాలు కలవకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

హాస్టళ్లలో వసతులు మెరుగుపరుస్తాం

ఉండి: ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు సోమవారం ఉండిలో పర్యటించారు. గ్రామంలోని బీసీ బాయ్స్ హాస్టల్, ఎస్సీ బాలికల హాస్టల్‌ను సందర్శించారు. హాస్టళ్లలో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని అన్నారు. మరుగుదొడ్ల మరమ్మతులు చేపడతామన్నారు. అలాగే ప్రతి గదిలో విద్యార్థులకు బెడ్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ పనులన్నీ త్వరలోనే జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, జిల్లా నాయకుడు జుత్తిగ శ్రీనివాస్, కాగిత మహంకాళి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వారాహి హోమం



వారాహి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం మెంటేవారితోటలోని శ్రీబాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారి ఆలయంలో వారాహి నవరాత్రుల్లో భాగంగా సోమవారం వారాహి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో యామిజాల కృష్ణ శర్మ, ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్‌లు అమ్మవారికి కుంకుమ పూజలు, పంచామృతాలతో అభిషేకాలను వేదమంత్రాలతో నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వారాహి నవరాత్రులు ముగింపు సందర్భంగా వేద మంత్రాలతో వారాహి హోమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని, హోమాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.